# పాడికి అసమ్మతి పోటు!

## జమ్మికుంట బీఆర్ఎస్‌లో ముసలం

- మున్సిపల్ ఎన్నికల అనంతరం రెండోసారి రాజుకున్న అసమ్మతి మంటలు
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా ఏకమైన బీఆర్ఎస్ సీనియర్ నేతలు
- ఈటల పుట్టినరోజున రహస్య సమావేశం.. అధికార పార్టీ నేతలతోనూ మంతనాలు?
- 'ప్రజానావ' జర్నలిస్టుకు అందిన పక్కా సమాచారం

**ప్రజానావ, జమ్మికుంట:** హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి అసమ్మతి సెగ తగిలే తప్పేలా లేదు. బీఆర్ఎస్‌లో ఫైర్ బ్రాండ్‌గా గుర్తింపు తెచ్చుకున్న కౌశిక్ రెడ్డి సొంత ఇలాకాలో కేడర్‌ను పట్టించుకోవడం లేదన్న ప్రచారం జోరందుకుంది. మున్సిపల్ ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరుతో జమ్మికుంట బీఆర్ఎస్ నేతల్లో నైరాశ్యం అలుముకుంది. హుజూరాబాద్ నియోజకవర్గానికి గుండెకాయగా ఉన్న జమ్మికుంట మండల బీఆర్ఎస్ నేతల రహస్య సమావేశం కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో సంచలనం రేపుతోంది.




### పార్టీలోనే ఉంటాం కానీ..

జమ్మికుంట మండల బీఆర్ఎస్ నేతలకు అవమానాలే ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సీనియర్ నేతలు తక్కళపల్లి రాజేశ్వర్ రావు, పొడేటి రామస్వామి, కనుమల్ల విజయ గణపతిలు చైర్మన్ అశావహులుగా ఎన్నికల బరిలో నిలిచారు. అయితే మున్సిపల్ ఎన్నికల సమయంలో ఈ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఓటమి పాలవడంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన మార్క్ రాజకీయం చూపించాడన్న ప్రచారం నియోజకవర్గంలో బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ విధేయులుగా ఉన్న సీనియర్లంతా శుక్రవారం రాత్రి మరోసారి రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. 'బీఆర్ఎస్‌లో గతంలో ఎన్నడూ లేని అవమానాలు ఎదర్కొంటున్నాం.. పాడితో ఇగ ఉండలేం.. అలా అని పార్టీని వీడలేక పోతున్నాం' అంటూ నేతలు తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతు న్నారు.

### అధికార పార్టీతోనూ..

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీరుతో విసిగి వేసారిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులంతా ఆంతర్మథనంలో కొట్టుమిట్టాడుతున్నారు. మాజీ మంత్రి స్థానిక మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హయాంలో తమకు ఇచ్చిన గౌరవాన్ని ఈ రహస్య సమావేశంలో చర్చించుకోవడం ప్రధాన అంశంగా మారింది. మరికొంత మంది నాయకులు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులతో టచ్ ఉన్నట్లు బహిర్గతమైంది. గతంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బల్మూరి వెంకట్‌కు ప్రభుత్వం విప్‌గా అవకాశం కల్పించిన నేపథ్యంలో శుభాకాంక్షలు తెలుపుతూ తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా పార్టీ మార్పుపై పలు చర్చలు జరగడం హుజూరాబాద్ నియోజకవర్గ రాజకీయంపై తీవ్ర ప్రభావం చూపనుంది. జమ్మికుంటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేతలు గడిచిన 25 రోజుల్లో రెండుసార్లు రహస్య సమావేశాలు నిర్వహించినా ఎమ్మెల్యే కౌశిక్ ఏమాత్రం పట్టించుకోకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొమ్మన లేక పొగ పెట్టినట్లుగా.. సొంత పార్టీ నేతలపై కౌశిక్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారంటూ నాయకులు మండిపడుతున్నారు. రెండు రోజుల్లో పార్టీ అధినేత కేసీఆర్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లను కలిసి పాడిపై తెల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి జమ్మికుంటలో బీఆర్ఎస్‌లో మొదలైన ముసలం ఎటు దారితీస్తుందోనన్న చర్చ ఇటు నియోజకవర్గంతో పాటు అటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆసక్తికరంగా మారింది.

### ఈటల పుట్టినరోజునే..

గతంలో బీఆర్ఎస్‌లో నెంబర్ 2గా.. హుజూరాబాద్‌పై ప్రత్యేక ముద్ర వేసిన నాయకుడు ఈటల రాజేందర్. ఆయన పుట్టినరోజైన శుక్రవారం నాడు జమ్మికుంట బీఆర్ఎస్ నేతల రహస్య సమావేశం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఈటల నాయకత్వంలో తమకు దక్కిన గౌరవాన్ని ఈ సందర్భంగా నేతలంతా గుర్తు చేసుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఏకపక్ష ధోరణి.. ప్రభుత్వ అధికారులపై ఆయన అవలంబిస్తున్న తీరుపైనా కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం ఇప్పటివరకు బీఆర్ఎస్ నేతలకు ధైర్యం నింపే ప్రయత్నం చే యకపోవడంతో వారంతా ఆగ్రహంతో ఉన్నారు. 'బీఆర్ఎస్‌ను వీడాలని లేదు.. అలా అని పాడితో వేగలేం' అంటూ అసమ్మతి నాయకులంతా ముక్తకంఠంతో ముందుకురావడం గమనార్హం.




# దళిత సంక్షేమానికి బడ్జెట్ భరోసా

- ఎస్సీ, ఎస్టీలకు రూ. 19,721 కోట్ల కేటాయింపు
- అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌తో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు
- దివ్యాంగుల పెళ్లిళ్లకు రూ. 2 లక్షల నగదు ప్రోత్సాహకం
- ఉద్యోగులకు కోటి పైగా ప్రమాద బీమా అన్న మంత్రి అడ్లూరి



**ప్రజానావ, గొల్లపెల్లి:**

దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల సాధికారతను కేంద్రబిందువుగా చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రూపొందించిన 2026-27 బడ్జెట్ సమగ్రాభివృద్ధికి మార్గదర్శిగా నిలుస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రతిపాదించిన సామాజిక న్యాయం, సమాన అవకాశాల లక్ష్యాలను ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. షెడ్యూల్డ్ కులాలకు రూ. 11,784 కోట్లు, షెడ్యూల్డ్ తెగలకు రూ. 7,935 కోట్లు కలిపి మొత్తం రూ. 19,721 కోట్ల భారీ కేటాయింపులు చేయడం ద్వారా అట్టడుగు వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఆధునిక సదుపాయాలతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కాచిగూడ మౌళి అడ్డ వద్ద బాబు జగ్జీవన్ రామ్ కళాశాల విద్యార్థి వసతి భవనాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ కేంద్రాల్లో దళిత విద్యార్థులకు అత్యున్నత స్థాయి శిక్షణ అందించి సివిల్స్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా దళిత సామాజిక మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 368 కోట్ల 27 లక్షల వ్యయంతో 910 ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవనాలు, విగ్రహాలు మంజూరు చేసినట్లు వివరించారు.

సంక్షేమంలో భాగంగా దివ్యాంగుల వివాహాలను ప్రోత్సహిస్తూ రూ. 2 లక్షల నగదు కానుక అందించడం ప్రభుత్వ సామాజిక బాధ్యతను చాటుతోందని మంత్రి అన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కోసం రూ. 4,000 కోట్లు ప్రతిపాదించడం ఈ బడ్జెట్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. చేయూత పథకం కింద అర్హులైన వారికి 2 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తూ రూ. 14,861 కోట్లు కేటాయించడం ప్రజల జీవన భద్రతకు పెద్ద అడుగు అని తెలిపారు. విద్యా రంగంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో ఉచిత విద్య కోసం రూ. 500 కోట్లు, విద్యార్థుల అల్పాహారం పథకానికి రూ. 800 కోట్లు కేటాయించామని చెప్పారు. వారానికి మూడు రోజులు పాలు, మిగతా రోజులు రాగి జావ అందిస్తామన్నారు.

ఆరోగ్య రంగంలో 23.50 లక్షల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం ప్రవేశపెట్టడం గొప్ప ముందడుగు అని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రమాద బీమా కింద మరణం సంభవించినట్లయితే రూ. 1.20 కోట్లు, టర్మ్ ఇన్సూరెన్స్ కింద రూ. 10 లక్షలు, విమాన ప్రమాదంలో అదనంగా రూ. 2 కోట్ల కవరేజ్ లభించేలా రూపకల్పన చేశామన్నారు. దీనివల్ల 7.57 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని, దీని కోసం రూ. 1,056 కోట్లు ప్రతిపాదించామని వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో అధిక వడ్డీతో తీసుకున్న రుణాలను పునర్వ్యవస్థీకరించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ బడ్జెట్ సామాజిక న్యాయం, సంక్షేమం కలగలిపిన ప్రణాళిక అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

# విద్యా రంగానికి బడ్జెట్ ఊతం

**రూ. 26,674 కోట్ల కేటాయింపులపై హర్షం**

**ఇందిరమ్మ బీమాతో పేదలకు భరోసా అన్న మహేందర్ రెడ్డి**

**ప్రజానావ, మెదక్:**



రాష్ట్ర అభివృద్ధికి పునాది అయిన విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 26,674 కోట్ల భారీ కేటాయింపు చేయడం అభినందనీయమని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కన్వీనర్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధ్యాయుల నియామకాలు, ఆధునిక సదుపాయాల విస్తరణ వేగవంతం అవుతాయని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించే దిశగా ఇది ఒక కీలకమైన అడుగు.

పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమం ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తుపై చూపుతున్న శ్రద్ధకు నిదర్శనం. ఇది విద్యార్థుల హాజరు, ఏకాగ్రత, విద్యా ఫలితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దేశంలోనే ప్రత్యేకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రవేశపెట్టి రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు భద్రత కల్పించడం ప్రభుత్వ దూరదృష్టిని ప్రతిబింబిస్తుంది. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల భీమా అందించడం ద్వారా అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించబడుతుంది. ప్రజా సంక్షేమానికి అంకితమైన కార్యక్రమాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

**సౌహార్దానికి ప్రతీక రంజాన్ పండుగ**

**అన్ని వసతులతో ఘనంగా ఏర్పాట్లు: ఎమ్మెల్యే గాంధీ**

**ప్రజానావ, శేరిలింగంపల్లి:**



పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర మాసం మనుషుల మధ్య సౌహార్దం, సహనం, సేవాభావం, దాతృత్వం వంటి గొప్ప విలువలను పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలు మనిషిలో ఆత్మ నియంత్రణను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇవి సమాజంలో సమానత్వ భావనను బలపరుస్తాయని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పండుగను ఘనంగా నిర్వహించేందుకు మసీదులు, ఈద్గాల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సమాజం కోసం ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాంధీ కొనియాడారు. అనేక సంక్షేమ పథకాలతో పాటు పండుగ కానుకగా బట్టలు పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రార్థనా స్థలాల వద్ద ఎటువంటి లోటు రాకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

# వైభవంగా రంగనాథుడి ఉగాది ఉత్సవాలు

**గోపనపల్లిలో భక్తిశ్రద్ధలతో వేడుకలు**

**కనుల పండువగా సహస్ర దీపాలంకరణ**

**భారీగా తరలివచ్చిన భక్తజనం**



**ప్రజానావ, శేరిలింగంపల్లి:**

గోపనపల్లి గ్రామంలోని శ్రీ రంగనాథ స్వామి ఉగాది ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవను అత్యంత వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని బ్యాండు, డప్పుల చప్పుళ్లు, సన్నాయి మేళాల మధ్య రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి పల్లకిలో ఊరేగించారు. నాలుగు గంటల పాటు సాగిన ఈ ఊరేగింపులో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక శ్రీ రంగ బావి వద్ద స్వామి వారికి అవభృత స్నానం చేయించి, మంగళ వాయిద్యాల మధ్య ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ అధ్యక్షులు రవీంద్ర ప్రసాద్ దూబే, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు నరసింహ, కార్యదర్శులు జితేందర్, పోచయ్య, సభ్యులు రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ముస్లింల ముంగిట్లోకి రంజాన్ తోఫా

**కష్టసుఖాల్లో అండగా ఉంటాం: వేముల సుభాష్**

**ముస్లిం సోదరులకు పండుగ కానుకల అందజేత**



**ప్రజానావ, గొల్లపెల్లి:**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రంజాన్ తోఫాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్, ఎం ఆర్ ఓ భూమేశ్వర్, ఇన్‌ఛార్జ్ ఎం పీ డీ ఓ వాసవి కలిసి ముస్లిం కుటుంబాలకు ఈ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా వేముల సుభాష్ మాట్లాడుతూ ముస్లిం సోదరుల కష్టసుఖాల్లో ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుంటుందని భరోసా ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లింలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఈ కానుకలను అందిస్తోందని తెలిపారు. ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నగునూరి నర్సగౌడ్, సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, ఉప సర్పంచ్ జంగ లావణ్య శ్రీనివాస్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరై ప్రభుత్వ కానుకలను స్వీకరించారు.

# దుర్గమ్మకు వైభవంగా బోనాలు

**రాంపూర్‌లో మిన్నంటిన ఆధ్యాత్మిక శోభ**

**రైతులు సుభిక్షంగా ఉండాలని సర్పంచ్ మొక్కులు**



**ప్రజానావ, కొల్చారం:**

కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో దుర్గాభవాని మాత బోనాల పండుగ శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తులంతా కలిసి అమ్మవారికి బోనాల ఊరేగింపును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. డబ్బు చప్పుళ్లతో బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది. శివసత్తుల ఆటలు, యువకులు పేల్చిన టపాసుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్ స్వయంగా ఏర్పాట్లను పరిశీలించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. రైతులు భారీ పంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోచయ్య, కృష్ణ, ప్రశాంత్, మంద సోమశేఖర్, ఉపాధ్యక్షులు గురు ప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు రవి ముదిరాజ్, ముత్యం, పవన్, మహేష్, సాయిరాం, అనిల్ తోపాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

# బుడగ జంగాలకు ఇళ్ల స్థలాల భరోసా

**బాధిత కుటుంబాలకు బండి రమేష్ అభయం**

**ఎమ్మార్వోతో చర్చించి పరిష్కరిస్తామని హామీ**

**రోడ్డున పడ్డ నిరుపేదలకు అండగా కాంగ్రెస్**

**ప్రజానావ, కూకట్‌పల్లి:**

అర్హులైన బుడగ జంగాల కుటుంబాలకు నివాస స్థలాలను ఇప్పించేలా కృషి చేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం కూకట్ పల్లిలోని హేమ దుర్గా పార్టీ కార్యాలయంలో బాధితులు ఆయనను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు నీడ కల్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. కైతలాపూర్ 995 సర్వే నంబర్ లోని ప్రభుత్వ స్థలంలో బుడగ జంగాల కుటుంబాలు గతంలో ఏండ్ల తరబడి గుడిసెలు వేసుకొని నివసించేవారు. అయితే రెండేళ్ల క్రితం అధికారులు ఆ స్థలం ప్రభుత్వానిదని పేర్కొంటూ వీరిని ఖాళీ చేయించారు. దీంతో వారంతా నిలువ నీడ లేక రోడ్డున పడ్డారని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. తమ గోడును వినేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల సమస్యపై వెంటనే స్పందించిన బండి రమేష్ స్థానిక ఎమ్మార్వో స్వామికి ఫోన్ చేసి మాట్లాడారు. నిరుపేదల పరిస్థితిని వివరించి సమస్య పరిష్కారానికి ఎక్కడైనా ఖాళీ ప్రభుత్వ స్థలం ఉంటే చూపించాలని సూచించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు త్వరలోనే న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శ్రీను, రాము తోపాటు పలువురు కార్యకర్తలు, బాధితులు పాల్గొన్నారు.



# ఏఈ వేధింపులపై ఉద్యోగుల గళం

- ఎస్ఈ కార్యాలయం ముట్టడి.. నిరసన హోరు
- చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం



**ప్రజానావ, పెద్దపల్లి:**

విద్యుత్ శాఖలో కొందరు అధికారుల అహంకారపూరిత వైఖరి సామాన్య ఉద్యోగులకు శాపంగా మారుతోంది. తాజాగా పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ ఆపరేషన్ ఏఈ మానాల ప్రసాద్ తీరుపై యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సమరశంఖం పూరించింది. ఆపరేటర్లను మానసిక వేధింపులకు గురిచేస్తున్న ఏఈపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాఘవపూర్ లోని ఎస్ఈ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఉధృత నిరసన చేపట్టారు.

**మద్యం మత్తులో వేధింపులు**

ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. స్వామి మాట్లాడుతూ ఏఈ ప్రసాద్‌పై సంచలన ఆరోపణలు చేశారు. సబ్ స్టేషన్లలో నిరంతరం విధులు నిర్వహించే ఆపరేటర్ల పట్ల ఏఈ అత్యంత దురుసుగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి సమయాల్లో మద్యం సేవించి సబ్ స్టేషన్లకు వెళ్లడం, అక్కడ సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం ఏ రకమైన విధి నిర్వహణ అని ఆయన ప్రశ్నించారు.

**ఉన్నత స్థాయి విచారణకు డిమాండ్**

విధుల్లోనే కాకుండా ఆపరేటర్ల వ్యక్తిగత గౌరవానికి భంగాం కలిగేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈ మానాల ప్రసాద్ అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరిపై తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరుతూ ఎస్ఈ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ జి. ఆంజనేయులు, రీజనల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాగు నాయక్, సీహెచ్ నర్సయ్య పాల్గొన్నారు. వీరితో పాటు డివిజన్ నేతలు కొండయ్య, కే. నరేష్, పెద్దపల్లి సర్కిల్ గౌరవ అధ్యక్షులు భిక్షపతి, మంథని డివిజన్ ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్, సర్కిల్ పరిధిలోని ఆపరేటర్లు, యూనియన్ నాయకులు హాజరయ్యారు.

# మొక్కజొన్న రైతుకు అకాల కష్టం



- పంటలను పరిశీలించిన దాసరి మనోహర్ రెడ్డి
- కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్

**ప్రజానావ, పెద్దపల్లి:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి, కూనారం గ్రామాల్లో అకాల వర్షాల వల్ల నష్టపోయిన మొక్కజొన్న పంటలను మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి సందర్శించారు. పంట పొలాల్లోకి వెళ్లి దెబ్బతిన్న కంకులను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 500 నుండి 1000 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని తెలిపారు. నష్టపోయిన వారిలో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారని.. వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఎకరాకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మాజీ ఎంపీటీసీ దేవయ్య, మంథని రాజయ్య పాల్గొన్నారు. రాజు, వివేక్ పటేల్, వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనలో పాలుపంచుకున్నారు.



# నీటి పొదుపు.. మనందరి బాధ్యత!

- హఫీజ్‌పేటలో జల దినోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ
- భూగర్భ జలాల రక్షణకు ఇంకుడు గుంతలు తప్పనిసరి
- నీటి సంరక్షణపై అధికారుల ప్రతిజ్ఞ

**ప్రజానావ, శేరిలింగంపల్లి:**

ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో హఫీజ్ పేటలోని జల మండలి కార్యాలయంలో ప్రపంచ జల దినోత్సవ అవగాహన గోడపత్రికను ఆవిష్కరించారు. జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, 15వ డివిజన్ జనరల్ మేనేజర్ రమావత్ కృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి మార్చి 22వ తేదీని ప్రపంచ జల దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ప్రకృతి ప్రసాదించిన నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. భవిష్యత్తులో అందరికీ పరిశుభ్రమైన తాగు, సాగునీరు అందాలంటే నీటి పొదుపు అత్యవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచాలని అధికారులు పిలుపునిచ్చారు. వ్యర్థాలను భూమిలోకి ఇంకకుండా చూడటంతో పాటు చెట్లను విరివిగా పెంచాలన్నారు. ఇది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తేనే పర్యావరణ రక్షణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అనంతరం నీటి సంరక్షణపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మారబోయిన సదానంద్ యాదవ్, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ పాల్గొన్నారు. వీరితో పాటు జీవీ రావు, శివరామరెడ్డి, జనార్ధన్, ఉమా చంద్రశేఖర్, పాలం శ్రీను, జలమండలి అధికారులు హాజరయ్యారు.




# ఈద్గా వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజానావ, పెద్దపల్లి:** ముస్లింల పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈద్గా వద్ద మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ శుక్రవారం సందర్శించారు. నమాజ్ కు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈద్గా ఆవరణలో పారిశుధ్యం, తాగునీరు, టెంట్లు, కార్పెట్లు వంటి మౌలిక వసతులు కల్పించినట్లు చైర్మన్ తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పర్యటనలో కౌన్సిలర్లు ఫణీంద్ర భూపతి పటేల్, కొలిపాక సంపత్, అశ్రఫ్, అస్లాం పర్వేజ్ పాల్గొన్నారు. వీరితో పాటు ఏఈ సతీష్, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ పులిపాక రాజు, మసీదు కమిటీ సభ్యులు హాజరయ్యారు.



